సాక్షి ప్రకాశం
ఆదివారం । 19 । మార్చి । 2023



యాదవుల ఇలవేల్పు బొల్లావు
పెద్దారవీడు మండలం గుండంచర్ల సమీపంలోని నల్లమల అడవిలో వెలసిన వేనూతల కాటంరాజు ఆలయంలో ఆదివారం తిరునాళ్ల నిర్వహించనున్నారు. - 8లో..



పోషక విలువలున్న ఆహారంతో ఆరోగ్యం
పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. - 10లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30 /22
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆడిట్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

ఒంగోలు: బ్యాంకు ఆడిట్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఛార్టర్డ్ అకౌంటెంట్ జానకీనాథ్ సూచించారు. స్థానిక దక్షిణ భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ ఒంగోలు బ్రాంచి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాపుల వల్ల ఒంగోలు బ్రాంచి సభ్యులకు బ్యాంకు ఆడిట్‌లో వారికి ఉన్న సందేహాలు నివృత్తి చేసుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఒంగోలు బ్రాంచి చైర్మన్ సీఏ నారపరెడ్డి చైతన్యరెడ్డి మాట్లాడుతూ మునుముందు కూడా ఇటువంటి వర్క్‌షాప్‌లు అనేకం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సీఏ కాశీప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు ఆడిట్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, రిజర్వు బ్యాంకు తాజాగా విడుదల చేసిన సర్క్యులర్ల గురించి విపులంగా వివరించారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎస్.సుబ్రహ్మణ్యం, రీజినల్ కౌన్సిల్ మెంబర్ సీఏ ముప్పాళ్ల సుబ్బారావు, ఒంగోలు బ్రాంచి వైస్ చైర్మన్ చుండూరి ప్రేమ్‌కుమార్, కార్యదర్శి కొణిజేటి కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

డీజీ పేటలో సినిమా షూటింగ్ సందడి



షూటింగ్ షాట్ ను వివరిస్తున్న డైరెక్టర్ తన్నీరు చిరంజీవి

సీఎస్‌పురం: మండలంలోని డీజీపేటలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. జబర్దస్త్ ప్రోగ్రాంలో పాత్రధారి అదిరే అభి, సోనాక్షి హీరో హీరోయిన్లుగా, తన్నీరు చిరంజీవి దర్శకత్వంలో జై చిరంజీవ మూవీ మేకర్స్ బ్యానర్ పై సక్కినాన భూలక్ష్మి సినిమా తీస్తున్నారు. ఆర్మీకి సంబంధించిన కథ నేపథ్యంతో నిర్మిస్తున్న ఈ సినిమాలో కొన్ని సీన్లను ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన, డీజీపేట తదితర ప్రాంతాల్లో చిత్రీకరించనున్నారు. ఇందులో భాగంగా శనివారం డీజీపేట లోని రాచూరి పెద్దమ్మతల్లి ఆలయంలో చిత్ర బృందం పూజలు చేపట్టి ఆలయ పరిసర ప్రాంతంలో షూటింగ్ మొదలు పెట్టారు.

బోదకాలు వ్యాధిగ్రస్తుల కిట్లకు టెండర్ల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: జిల్లాలోని బోదకాలు వ్యాధిగ్రస్తులకు మార్బిడిటీ మేనేజ్‌మెంట్ ద్వారా కిట్స్ అందించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్న జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో కిట్ రూ.500గా నిర్ణయించినట్లు తెలిపారు. కిట్‌లో ప్లాస్టిక్‌టబ్, మగ్, నేప్‌కిన్స్, కాటన్ రోల్స్,ఆయింట్‌మెంట్, మెడికేటెడ్ సోప్స్, డెటాల్ తదితర వస్తువులు నిర్దేశిత కొలతతో ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.2 వేలు డిమాండ్ డ్రాఫ్ట్‌ను జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో అందచేసి నిర్ణీత టెండర్ ఫారం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల లోపు సీల్డ్ కవర్లలో టెండర్లు అందచేయాలని తెలిపారు.

గంజాయ్‌పై పంజా..!

గంజాయి అనే పేరు వినాలంటేనే గడగడలాడిపోయేలా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. గంజాయి సరఫరా ముఠాలపై ఉక్కుపాదం మోపుతోంది. ఎస్‌ఈబీ, పోలీస్ శాఖల ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. బియాండ్ ద బోర్డర్ ఇన్వెస్టిగేషన్‌తో అంతర్ రాష్ట్ర గంజాయి ముఠాల అంతుచూస్తోంది. పీడీ యాక్టు, స్పెషల్ డ్రైవ్‌లతో వేట సాగిస్తోంది. అందులో భాగంగానే జిల్లాలో ఇప్పటి వరకు 50కిపైగా గంజాయి కేసులు నమోదు చేసింది.



- ఎస్‌ఈబీ, పోలీస్ సంయుక్త వేట
- సరఫరా చేసే వారిపై ఉక్కుపాదం
- అంతర్ రాష్ట్ర ముఠాలపై నిఘా
- మూలాలపై స్పెషల్ డ్రైవ్
- పీడీ యాక్ట్ అమలుకు సిద్ధం
- సరిహద్దులు దాటి విచారణ
- జిల్లాలో ఇప్పటి వరకు 50కిపైగా కేసులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: యువతను మత్తులో ముంచెత్తుతూ.. వారి జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి దందాను కూకటివేళ్లతో పెకలించి వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆంధ్రా–ఒడిశా బోర్డర్, విశాఖ మన్యంతో పాటు ఈశాన్య జిల్లాల్లో సాగవుతున్న గంజాయిపై ఉక్కుపాదం మోపింది. గంజాయి సాగును పూర్తిగా నిలువరించింది. ఆయా ప్రాంతాల్లోని గిరిజనులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపిస్తోంది. అధునాతన వాణిజ్యపరమైన పండ్ల తోటలు, ఇతర పంటలవైపు వారిని మరల్చింది. అయినా.. కొందరు అక్రమార్కులు చాటుమాటుగా గంజాయి అక్రమ రవాణా సాగిస్తూనే ఉన్నారు. అందుకే ఎస్పీ మలికాగర్గ్ గంజాయి అక్రమ రవాణా అనే మాట వినపడకూడదన్న నినాదంతో అడుగులు ముందుకేస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. అందుకోసం జిల్లాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రతి పోలీస్‌స్టేషన్లలోనూ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ గ్రామాల్లో సైతం గంజాయి మూలాలు కనపడితే వెంటనే చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

అంతర్ రాష్ట్ర ముఠాలపై నిఘా...

గంజాయి సరఫరా చేస్తున్న, కొనుగోలు చేస్తున్న వారిపై జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ప్రధానంగా గంజాయి సరఫరా చేసే అంతర్ రాష్ట్ర ముఠాలపై నిఘా పెంచారు. జిల్లా పరిధిలో పట్టుబడిన వారిపై కేసులు పెట్టడం, రిమాండ్‌కు పంపడం లాంటివి సర్వసాధారణం. అలాగాకుండా పట్టుబడిన గంజాయి అక్రమ వ్యాపార మూలాలపై ఎస్పీ మలికాగర్గ్ దృష్టి సారించారు. ఇటీవల జిల్లాలో 90 కేజీలకుపైగా గంజాయి పట్టుకున్నారు. ఆ గంజాయి ఎక్కడ నుంచి వస్తోంది.. ఎక్కడకు వెళ్తోందనే అన్ని అంశాలపై ప్రత్యేకంగా దర్యాప్తు ప్రారంభించారు. ఇటు ఆంధ్రా–ఒడిశా బోర్డర్ మొదలుకుని అటు చెన్నై, బెంగళూరు లాంటి నగరాలకు వెళ్లే గంజాయి మూలాలపై కూడా దృష్టి సారించారు. అందుకే 'బియాండ్ ద బోర్డర్' అనే నినాదంతో ఎల్లలు దాటి విచారణలు, దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవల పట్టుకున్న గంజాయి చెన్నైకి చేరుతున్నట్లు గుర్తించి ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. లింకులు బయటకు తీస్తున్నాయి.

పీడీ యాక్ట్...

గంజాయి సరఫరా, రవాణా, వాడకం.. ఇలాంటివి ఏవైనా చేస్తున్నట్లు తేలితే అలాంటి వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు కూడా వెనకాడటం లేదు. అందుకోసం ఎస్‌ఈబీ–పోలీసులు సంయుక్తంగా గంజాయిపై పోరు ఉధృతం చేశారు. గతంలో పోలీసుల మీద ఎక్సైజ్ విభాగం.. ఎక్సైజ్ విభాగం మీద పోలీసులు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ కాలం గడిపేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రెండు విభాగాలు సమన్వయంతో ముందుకెళ్తున్నాయి. ఈ విధంగా ప్రత్యేకంగా దృష్టిసారించిన తర్వాత జిల్లాలో దాదాపు 50కిపైగా గంజాయి కేసులు నమోదు చేశారు. ఆయా కేసుల్లో అరెస్టయిన వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని వాటి మూలాలు ఎక్కడెకక్కడ ఉన్నాయనే దానిపై ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు.

కాలేజీల్లో అవగాహన సదస్సులు...

గంజాయి, మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగంపై కాలేజీల్లో ప్రత్యేకంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటుకాకుండా ఉండేలా వాటివలన కలిగే చెడు ప్రభావాలను వారికి వివరిస్తున్నారు. అదే విధంగా గంజాయి, మాదక ద్రవ్యాల సమాచారం తెలిస్తే ఎవరికి చేరవేయాలనే అంశాలను యువత, విద్యార్థులకు విశదీకరిస్తున్నారు. ఇప్పటికే ప్రకాశం ఎస్పీ మలికాగర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ సంయుక్తంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. కాలేజీల్లో లెక్చరర్, ప్రొఫెసర్, స్కూళ్లలో టీచర్‌తో పాటు కొంతమంది విద్యార్థులు, మహిళా పోలీస్‌లతో కమిటీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. యువతలో మార్పు తీసుకురావడంతో పాటు అవగాహన కల్పించడం, తనిఖీలు, ప్రత్యేక నిఘాలు.. ఇలా అన్ని కోణాల్లో గంజాయిపై పోరుబాట పట్టారు పోలీసులు.

తమిళనాడులోని తేనె జిల్లా కంభం అడ్డాగా..

కొన్ని రోజుల క్రితం జె.పంగులూరు పోలీసు స్టేషన్ పరిధిలో హైవేపై బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 200 కేజీల గంజాయిని పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో తమిళనాడు రాష్ట్రంలోని తేనె జిల్లా కంభం గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఇది జరిగిన వారం రోజులకే రాజమండ్రి నుంచి తమిళనాడు రాష్ట్రానికి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న లారీని పట్టపగలు సినీ ఫక్కీలో వెంటాడి పోలీసులు పట్టుకున్నారు. అందులో రూ.25 లక్షల విలువ చేసే 400 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాజమండ్రి నుంచి తమిళనాడు రాష్ట్రానికి గంజాయి లారీ వెళ్తున్నట్లు సమాచారం అందుకున్న ప్రకాశం జిల్లా పోలీసులు త్రోవగుంట–చీరాల జాతీయ రహదారిపై తనిఖీలు ముమ్మరం చేశారు. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, లారీని చీరాల నుంచి దారి మళ్లించినట్లు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసు బృందాలు రంగంలోకి దిగి లారీని ఛేజ్ చేస్తూ నెల్లూరు జిల్లా గూడూరు వద్ద పట్టుకుని నాగులుప్పలపాడు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో ఉన్న అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠాకు చెందిన నలుగురు వ్యక్తులు తమిళనాడు రాష్ట్రం తేనె జిల్లా కంభం గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఇటీవల గంజాయి తరలిస్తూ పోలీసులకు చిక్కి రిమాండ్‌లో ఉన్న నిందితులు ముగ్గురు కూడా ఇదే గ్రామానికి చెందినవారు కావడం గమనార్హం. అంటే తేనె జిల్లా కంభం గ్రామానికి చెందిన వ్యక్తులే గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు వెలుగులోకి రావడంతో అసలు సూత్రధారులు ఎవరై ఉంటారనే దానిపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు.



మాదకద్రవ్యాల నివారణపై సదస్సుకు హాజరవుతున్న ఎస్పీలు మలికాగర్గ్, వకుల్ జిందాల్ (ఫైల్)

నేడే జగనన్న విద్యాదీవెన



- ఈ ఏడాది మొదటి విడత నిధులు విడుదల
- జిల్లాలో 50,174 మంది విద్యార్థులకు లబ్ధి
- జమకానున్న మొత్తం రూ.37.46 కోట్లు

ఒంగోలు: జగనన్న విద్యాదీవెన 2022–23 మొదటి త్రైమాసిక నిధులు ఆదివారం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమకానున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరులో జరిగే కార్యక్రమంలో నిధులు విడుదల చేయనున్నారు. అదే సమయంలో స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే మెగా చెక్కు పంపిణీ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరుకానున్నారు. జిల్లాలో ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి సంబంధించి మొత్తం రూ.37.46 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుంది.

45,241 మంది తల్లుల ఖాతాల్లో నిధులు జమ:

డిగ్రీ, పీజీతోపాటు ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఈ నిధులు విడుదల కానున్నాయి. జిల్లాలో 50,174 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా వారి తల్లులు 45,241 మంది ఉన్నారు. వీరందరి బ్యాంకు ఖాతాల్లో ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేసినప్పటి నుంచి నిధులు జమకానున్నాయి. ఎస్సీ విద్యార్థులు 12,913, ఎస్టీ 1,185, బీసీ 16,574, ఈబీసీ 13,276, ముస్లిం మైనార్టీ 3,186, కాపు 2,984, క్రిస్టియన్ మైనార్టీ 56 మంది విద్యార్థులకు సంబంధించిన నిధులు వారి తల్లుల ఖాతాల్లో జమవుతాయి. ఈ సందర్భంగా అన్ని కాలేజీలు, జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు హాజరయ్యేలా సహాయ సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలంటూ జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమం, సాధికారత అధికారి, నోడల్ అధికారి ఎస్.లక్ష్మానాయక్ ఆదేశించారు.

సంక్షేమ శాఖ	విద్యార్థుల సంఖ్య	విద్యార్థుల తల్లుల సంఖ్య	విడుదల అవుతున్న మొత్తం (రూ.)
ఎస్సీ	12913	11541	11,99,42,593
ఎస్టీ	1185	1070	67,15,290
బీసీ	16574	14983	10,10,28,843
ఈబీసీ	13276	12029	10,72,51,146
ముస్లిం మైనార్టీ	3186	2837	1,89,79,266
కాపు	2984	2731	2,02,51,403
క్రిస్టియన్ మైనార్టీ	56	50	4,59,584
మొత్తం	50,174	45,241	37,46,28,125

ఇసుకను అందుబాటులో ఉంచాలి

- నిర్మాణాలకు సరిపడా సిద్ధంగా ఉండాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో ఇసుక కమిటీ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ

ఒంగోలు అర్బన్: జిల్లాలో నిర్మాణాలకు సరిపడా ఇసుకను అందుబాటులో ఉంచాలని జేపీ వెంచర్స్ నిర్వాహకులను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలో శనివారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇసుక నిల్వలు, రాబోయే సీజన్లకు ఇసుక కొరత లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సీజన్‌కు 2 లక్షల మెట్రిక్ టన్నులు, వర్షాకాలంలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచాలని సరఫరాదారులను ఆదేశించారు. ఇసుక తవ్వకం పాయింట్లతో ఇసుక డిపోలను మ్యాపింగ్ చేయాలన్నారు. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలకు ప్రత్యేక గుర్తింపు నంబర్లు కేటాయించాలన్నారు. ఇసుక నాణ్యతను తవ్వకం పాయింట్ల వద్దే పరీక్షించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు వినియోగానికి ఎంత ఇసుక అవసరమవుతుందో శాఖల వారీగా అంచనాలు అందజేయాలన్నారు. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలను నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, మైనింగ్, సెబ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక అక్రమాలను నివారించాలన్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకోవడంతో పాటు పట్టా భూ యజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. జరుగుమల్లిలో ఒకటి, ముండ్లమూరులో 3 ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసే ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఏఎస్పీ నాగేశ్వరరావు, గనుల శాఖ డీడీ జగన్నాథరావు, ఇరిగేషన్ ఎస్‌ఈ లక్ష్మారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్దన్ అలీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ నాగిరెడ్డి, సెబ్ ఎస్పీ ఆవులయ్య, మార్కాపురం, ఒంగోలు గనుల శాఖ సహాయ సంచాలకులు, జేపీ వెంచర్స్ ప్రతినిధులు, రవాణా, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు

- క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్ష హాలులోకి పంపాలి
- నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు
- పరీక్ష కేంద్రంలో చీఫ్‌తో సహా ఎవరి వద్ద సెల్‌ఫోన్ ఉండరాదు
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు, ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో పదో తరగతి, ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, మాల్ ప్రాక్టీస్‌కు సహకరించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు ప్రతిరోజు జరుగుతున్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. వెలుతురు, ఫ్యాన్లు, తాగునీరు, పరిశుభ్రంగా టాయిలెట్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రశ్నపత్రాలను స్టోరేజీ స్టేషన్ల నుంచి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లడం, పరీక్ష కేంద్రంలో వాటిని ఓపెన్ చేసేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించడంలో ఏమాత్రం ఉల్లంఘన జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల మాదిరిగా పరీక్షల నిర్వహణలోను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పాటించాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలోకి స్మార్ట్ వాచీలు, సెల్‌ఫోన్‌లు, ఇతర ఏ విధమైన ఎల్రక్టానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితులలోను అనుమతించరాదన్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్ష కేంద్రంలోకి పంపించాలని చెప్పారు. బయటి వ్యక్తులు ఎవరినీ పరీక్ష కేంద్రంలోకి అనుమతించరాదని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలోను ప్రాథమిక చికిత్స శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో ఏవిధమైన సహాయం కావాలన్నా డీఈవో కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణలోను పూర్తిస్థాయి అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి వారికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఏ విద్యార్థి నేలపై కూర్చొని పరీక్షలు రాయరాదని ఆదేశించారు. డ్యూటీ పాస్ లేకుండా పరీక్ష కేంద్రంలోకి ఎవరినీ అనుమతించరాదని, నో సెల్‌ఫోన్ జోన్ విధానాన్ని అనుసరించాలన్నారు. చీఫ్‌తో సహా ఎవరి వద్ద సెల్‌ఫోన్ ఉండడానికి వీల్లేదన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలుతోపాటు సీ సెంటర్లకు వెళ్లే మార్గాల్లో రహదారుల స్థితి, ప్రయాణ సమయం వంటివి ముందుగానే తెలుసుకుని దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పదో తరగతి పరీక్షలకు 28,902 మంది రెగ్యులర్ విద్యార్థులు, ఒకసారి ఫెయిలైన అభ్యర్థులు 350 మంది హాజరవుతున్నందున వారికోసం 175 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్, ఓపెన్ స్కూల్‌సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి, ఉప విద్యాశాఖ అధికారి అనితరోజ్‌రాణి, ఏ.చంద్రమౌళీశ్వర్, డీసీఈబీ కార్యదర్శి డి.వెంకారెడ్డి, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ కేసీహెచ్ సుబ్బారావు, ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి టి.కిషోర్‌బాబు, మండల విద్యాశాఖ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య 520వ వర్ధంతి



అన్నమయ్యకు నివాళి అర్పిస్తున్న అన్నమయ్య సంగీత సాహిత్య సేవా సమితి ప్రతినిధులు

ఒంగోలు: పదకవితా పితామహుడు, వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమయ్య 520వ వర్ధంతి కార్యక్రమం స్థానిక సంతపేట షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని తాళ్లపాక అన్నమయ్య సంగీత సాహిత్య సేవా సమితి అధ్యక్షుడు ఐ.మురళీకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు ప్రజల్లో కేవలం భక్తిభావాన్ని మాత్రమే కాకుండా పలు సామాజిక కోణాలను స్పృశించారన్నారు. త్వరలో ఉచిత సంకీర్తన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య జన వ్యవహారిక భాషను సంకీర్తనల్లో నిలిపి శ్రీవారి లీలలను ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిపారన్నారు. మందిర నిర్వాహకుడు అళహరి చెంచలరావు మాట్లాడుతూ సకల వేదసారం అన్నమయ్య సంకీర్తనలు అని పేర్కొన్నారు. రాష్ట్ర ట్రాక్ సింగర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మా మూర్తి మాట్లాడుతూ సమసమాజ స్థాపన తెలుగు భాష అభివృద్ధిలోను అన్నమయ్య సంకీర్తనలు దోహదపడ్డాయన్నారు. కార్యక్రమంలో భాగంగా అన్నమయ్యకు అష్టోత్తర శతనామావళి, సామూహిక సంకీర్తన గళార్చన, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

యాదవుల ఇలవేల్పు బొల్లావు


వేనూతల కాటంరాజు మూల విరాట్


గంగా భవానీల మూలవిరాట్


బొల్లావు

- తిరునాళ్లకు ముస్తాబైన కాటంరాజుస్వామి దేవాలయం
- తరలిరానున్న వేలాది మంది భక్తులు

గుండంచర్ల (పెద్దారవీడు): మండలంలో ఉన్న గుండంచర్ల పంచాయతీ సమీపంలోని నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూతల కాటంరాజు దేవాలయంలో మంగళవారం (తెల్లవారితే బుధవారం ఉగాది) తిరునాళ్లను అత్యంత వైభవంగా జరిపేందుక అంతా సిద్ధమైంది. దేవాలయంలో కాటంరాజు స్వామి, గంగాభవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్వామి వారిని భక్తులు దర్శించుకునేందుకు భారీగా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉగాది ముందు రోజు గ్రామాల్లో యాదువులు బొల్లావును తలపై ఉంచి ఊరేగింపు చేసుకుంటూ కాటంరాజుస్వామి ఆలయం వద్దకు వెళ్తుంటారు. రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తదితర రాష్ట్రాలు, జిల్లా నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తిరునాళ్లకు తరలివెళ్లనున్నారు.

ఆలయ చరిత్ర

13వ శతాబ్దంలో కాటంరాజు కనిగిరి ప్రాంతాన్ని పరిపాలిస్తుండేవారు. కనిగిరి సమీపంలోని పంచలింగాల కొండ దిగువన కోట ఉండేది. కాటంరాజుకు విస్తారమైన పశుసంపద ఉండేది. అందుకే 'కాటంరాజు ఆవుల మంద కుదిరితే ఆరు ఆమడ, చెదిరితే పన్నెండు ఆమడ' అనే సామెత ఏర్పడింది. తమ జీవ సంపదను బొల్లావుల ద్వారా కాటంరాజు కాపాడతాడని పశ్చిమ ప్రాంత పశుపోషకులు, పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతాంగం ప్రగాఢంగా నమ్ముతారు. ఆలయంలో కాటంరాజు రాతి విగ్రహం, దానికి ఎదురుగా అతిపురాతనమైన ఒరగోగుమాను చెట్టు, కాటంరాజు భార్య గంగభవానీల దేవత విగ్రహం ఉన్నాయి. యాదవులు తమ జీవసంపదను బొల్లావు ద్వారా కాటంరాజు రక్షిస్తాడని పశుపోషకుల ప్రగాఢ విశ్వాసం. కాటంరాజు నల్లమల అడవుల్లో నిర్మించుకున్న ఆశ్రమ ప్రాంతమే నేటి కాటంరాజు దేవాలయం. ఈ ప్రాంతంలో కాటంరాజు తన త్రిశూలంతో కోనేటి బావిని ఏర్పాటు చేశాడని పెద్దలు చెబుతుంటారు. ఈ దేవాలయం ప్రాంతంలో ఉన్న వందలాది బావులు అనాడు కాటంరాజు ఆవుల మంద మంచినీటి కోసం తవ్వినవేనని చెప్పుకుంటారు.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

మంగళవారం జరగనున్న కాటంరాజు తిరునాళ్లకు మార్కాపురం డిపో వారు మార్కాపురం పట్టణం గరల్స్ హై స్కూల్ నుంచి, గిద్దలూరు డిపోల నుంచి వయా మాగుటూరు మీదుగా ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు నడుపుతుంటారు. ఆటోలు, ట్రాక్టర్లు, లారీలతో పాటు ఇతర ప్రైవేటు వాహనాలు భారీ సంఖ్యలో వేలాది భక్తులను దేవాలయం వద్దకు చేరవేస్తుంటాయి.

బొల్లావు నిర్మాణం

యాదవుల ఇలవేల్పుగా ఆరాధించి పూజించే బొల్లావును రెండున్నర అడుగుల ఎత్తులో తేలికైన కలపతో తయారు చేస్తారు. ఎరుపు రంగుతో అందంగా తీర్చిదిద్దుతారు. రెండు తొడలపై ఆంజనేయస్వామి, గరుత్మంతుడు, డొక్కకు సింహతలాటం, వీపున నాగబంధం, మూపురం (చెండు)కు ఇరువైపుల శంకు చక్రాలు, నొసటన గాంభీర్యాన్ని, అందాన్ని చేకూరుస్తాయి. కొమ్ముకు వెండి గొడుగులు, చెవులకు, మెడకు ఆభరణాలు, వీరతాళ్లతో అలంకరిస్తారు.

నైవేద్యం చెల్లింపులో నేనంటే నేను

భక్తులు పొంగళ్లు చేసి స్వామి వారికి మొక్కులు చెల్లిస్తారు. ఆలయం ప్రాంగణం చుట్టూ మహిళలు నైవేద్యంతో పాటు బొల్లావును నెత్తిన పెట్టుకొని తప్పెట్లతో కొమ్ము ఊదుతూ అనందోత్సాహాలతో ఊరేగింపుగా తిరుగుతారు. అయితే స్వామికి నైవేద్యం చెల్లించడంలో మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామస్తులు, అర్ధవీడు మండలం మాగుటూరు గ్రామానికి చెందిన వారిలో ఎవరు ముందు నైవేద్యం సమర్పించే విషయంలో పోటీలు పడతారు. ఆ సమయంలో భక్తులతో పాటు పోలీసుల చూపు ఆ రెండు గ్రామస్తుల వైపు ఉంటుంది. అర్ధరాత్రి సమయంలో చివరి ఘడియాల్లో కొలువు ముగుస్తుంది.

20 నుంచి సంపూర్ణ శతావధానం

ఒంగోలు: ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు డాక్టర్ బులుసు అపర్ణచే సంపూర్ణ శతావధానం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు శతావధానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ బులుసు అపర్ణ ఇప్పటికే 260 అష్టావధానాలు, ఐదు శతావధానాలు విజయవంతంగా పూర్తిచేశారన్నారు. ఈ శతావధానంలో పృచ్ఛకులుగా విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తెనాలి, తిరుపతి ప్రాంతాలతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రముఖ కవులు పాల్గొంటారన్నారు. శతావధానాన్ని వీక్షించే ప్రేక్షకులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు, కార్యక్రమ సమన్వయకర్త పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ శతావధానం అనేది అక్షర క్రీడని అన్నారు. వందమంది కవులు అడిగే సమస్యలను పద్యరూపంలో పూరించడమే కాకుండా చివరిరోజు ఆ పద్యాలను ధారణ చేయడంతో అవధానం ముగుస్తుందన్నారు. గతంలో కొండపి మురళీకృష్ణ, నారాయణ బాలసుబ్రహ్మణ్యం జిల్లాలో శతావధానాలు చేశారని, మొట్టమొదటి మహిళా శతావధానాన్ని డాక్టర్ బులుసు అపర్ణ జిల్లాలో నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సంపూర్ణ శతావధానానికి గురు సహస్రావధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ సంచాలకులుగా, భువనగిరి పురుషోత్తం వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారన్నారు. మొట్టమొదటి తెలుగు పద్యం పుట్టిన గడ్డపై మహిళా శతావధానం ఏర్పాటు చేసిన నిర్వాహకులు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్‌ను ఆయన అభినందించారు. విలేకరుల సమావేశంలో క్లబ్ కార్యదర్శి కసిబిసి నాగేశ్వరరావు, కో ఆర్డినేటర్ దుగ్గిరెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు రామకృష్ణ

యువకుడు బలవన్మరణం

పెద్దదోర్నాల: చెట్టుకు ఉరి వేసుకుని ఓ గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో గుంటూరు రోడ్డులో ఉన్న భారత్ పెట్రోల్ బంక్ వెనుక భాగంలో శనివారం చోటు చేసుకుంది. చెట్టుకు ఉరి వేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటనతో ప్రజలు ఒక్క సారిగా ఉలిక్కి పడ్డారు. ఈ సంఘటన పెట్రోల్ బంక్ వెనుక భాగంలో చోటు చేసుకోవటంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. దీంతో సంఘటనా స్థలికి సిబ్బందితో కలిసి చేరుకున్న ఎస్సై శ్రీనివాసరావు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు వెల్లడించారు. చనిపోయిన యువకుడి వయస్సు సుమారు 30 సంవత్సరాల వరకు ఉంటుంది. పెట్రోల్ బంక్ కాంపౌండ్ గోడపైకెక్కి తాడుతో చెట్టు ఉరి వేసుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగి ఉండవచ్చంటున్నారు. మృతి చెందిన యువకుడు శుక్రవారం ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి పెద్దదోర్నాలకు టికెట్టు తీసుకుని వచ్చినట్లు పోలీసు విచారణలో తెలిసింది. యువకుడు హిందీలో మాట్లాడినట్లు అతను ప్రయాణించిన బస్సు కండక్టర్, డ్రైవర్‌లు తెలిపారు. ఉరి వేసుకున్న సమయంలో మృతుడి శరీరంపై ఎరుపు రంగు టీ షర్ట్, మోకాళ్ల వరకు బ్లూ కలర్ చెక్స్ కలిగిన నిక్కరు ధరించి ఉన్నాడు. కేసును నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఎస్ఎస్ ట్యాంకులు ఫుల్లు

- 85 శాతానికి పైగా జలాలు


నీటి నిల్వను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు: వేసవి దృష్టిలో ఉంచుకుని నగర ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ యం.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక సమ్మర్ స్టోరేజీ ట్యాంకులలోని నీటి పరిమాణాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజీ ట్యాంకు 1 గరిష్ఠ సామర్థ్యం 1950 మిలియన్ లీటర్లుగా తెలిపారు. అందులో ప్రస్తుతం 1690.800 మిల్లీలీటర్లు ఉందన్నారు. రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు గరిష్ఠ సామర్థ్యం 3750 మిలియన్ లీటర్లు అని, అందులో ప్రస్తుతం 3346.63 మిలియన్‌లీటర్లు ఉందన్నారు. మొత్తంగా 5800 మిలియన్ లీటర్లుకుగాను 4955.71మిలియన్ లీటర్లు (85.44శాతం) నీరు చేరిందని తెలిపారు. సాగర్ నీరు ఇంకా చెరువులకు వస్తూనే ఉందని అందువల్ల వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్య ఉండదన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లోకి వస్తున్న నీటి విడుదల ప్రక్రియను ప్రతిరోజూ నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం


రైల్వే ట్రాక్ వద్ద బోల్తా పడిన లారీ

చీరాల: రైల్వే ట్రాక్ మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా లారీ తిరగబడటంతో పెను ప్రమాదం తప్పింది. ఈఘటన శనివారం చీరాల ఫైర్ ఆఫీసు రైల్వే గేటు వద్ద చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. ఫైర్ ఆఫీసు గేటు వద్ద నిర్మాణంలో ఉన్న మూడో రైల్వే ట్రాక్ మరమ్మతులు చేస్తుండగా సిమెంట్, కంకర మెటీరియల్‌తో వచ్చిన లారీ ఒక్కసారిగా ట్రాక్ గుంతలో పడి తిరగబడింది. ఆ సమయంలో కొందరు కార్మికులు పనులు చేస్తున్నారు. లారీ బోల్తా పడటంతో కార్మికులు అప్రమత్తమై పక్కకు తొలగడంతో పెను ప్రమాదం తప్పింది. బోల్తా పడిన లారీని క్రేన్ సాయంతో పక్కకు తొలగించారు. దీంతో ప్రమాదం తప్పినట్లైంది.

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


సుధీర్‌రెడ్డి (ఫైల్)

కనిగిరి రూరల్: బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కనిగిరికి చెందిన పోతిరెడ్డి సుధీర్ రెడ్డి (39) మృతి చెందాడు. విశ్రాంత హెచ్ఎం పోతిరెడ్డి మాలకొండారెడ్డి రెండో కుమారుడు పి. సుధీర్‌రెడ్డి కొంత కాలంగా బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం బైక్‌పై ఆఫీసుకు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భౌతిక కాయాన్ని శనివారం కనిగిరికి తీసుకొచ్చారు. స్థానిక కొత్తపేటలోని స్వగృహంలో ఉంచిన భౌతిక కాయాన్ని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వైఎం ప్రసాద్‌రెడ్డి, ఎస్. మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాలవారు సందర్శించి నివాళులర్పించారు.

ఇన్‌చార్జి డీటీసీగా చందర్


ఇన్‌చార్జి డీటీసీ చందర్

ఒంగోలు అర్బన్: జిల్లా రవాణాశాఖ ఇన్‌చార్జి డీటీసీగా చందర్‌కు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర రవాణాశాఖ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం నెల్లూరు జిల్లా రవాణాశాఖ డీటీసీగా పనిచేస్తున్నారు. ప్రకాశం జిల్లా డీటీసీగా పనిచేస్తున్న కృష్ణవేణికి జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఇన్‌చార్జి డీటీసీగా చందర్ శనివారం ఒంగోలులో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను ప్రకాశం భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు.


కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసిన టూరిజం రీజనల్ డైరెక్టర్ వాకా శ్రీనివాసులురెడ్డి

కలెక్టర్‌ను కలిసిన టూరిజం ఆర్డీ...

కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను శనివారం ప్రకాశం భవనంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ వాకా శ్రీనివాసులరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గుండ్లకమ్మ, పాకల, కొత్తపట్నం టూరిజం స్థలాలు, జిల్లాలో టూరిజం అభివృద్ధి.. తదితర అంశాలపై చర్చించారు.

వ్యాయామ విద్య ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ హరిబాబు

- ఏకేయూ రిజిస్ట్రార్ బి.హరిబాబు

ఒంగోలు: వ్యాయామ విద్య ప్రాధాన్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆంధ్రకేసరి యూనివర్శిటీ(ఏకేయూ) రిజిస్ట్రార్ బి.హరిబాబు అన్నారు. స్థానిక ఏకేయూ యూనివర్శిటీలో లైఫ్ స్పాన్–మోటార్ డెవలప్‌మెంట్ అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సెమినార్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వ్యాయామ విద్య ప్రాముఖ్యతను వారికి తెలియజేసేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వ్యాయామ విద్య డీన్ డాక్టర్ పి.జాన్సన్ మాట్లాడుతూ కరోనా అనంతరం ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిందని, ఈ నేపథ్యంలో వ్యాయామం అందుకు ఎలా దోహదపడుతుందనే దానిపై ప్రతి ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమానికి ఏకేయూ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీ వరప్రసాద్ అధ్యక్షత వహించగా దక్షిణ భారతదేశానికి చెందిన వివిధ వ్యాయామ విద్యా నిష్ణాతులు పాల్గొని వ్యాయామ విద్య అవసరాన్ని, దాని వల్ల జీవితకాలం ఎలా పెరుగుతుందనే దానిపై ఉపన్యసించారు. కార్యక్రమంలో తమిళనాడు యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.బాలమురుగన్, ద్రవిడ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ ఎం.మస్తాన్, మనోమనియన్ సుందర్నర్ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ ఎస్.సేతు, స్థానిక యూనివర్శిటీ ఎంపీడీ, బీపీడీ విద్యార్థులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఎస్ కె ఆర్ ఎమ్ జూనియర్ కాలేజీ బ్రాంచి, ఒంగోలు
ఫోన్: 08592-282002. ఇ-మెయిల్: ubin0811823@unionbankofindia.bank

స్వాధీనతా ప్రకటన రూల్ 8(1)

ఇందుమూలముగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్ కె ఆర్ ఎమ్ జూనియర్ కాలేజీ బ్రాంచి, ఒంగోలు అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (యాక్టు 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **ఋణగ్రహీతలు : 1) శ్రీ ముండ్లమూరి వెంకట సాయి బోస్, తండ్రి. ఎమ్. బాల వెంకటేశ్వర్లు**, డి.నెం.టి 1 బ్లాక్, ఎ.ఆర్. క్వార్టర్స్, సుజాత నగర్ ఎదురుగా, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. **2) శ్రీ ముండ్లమూరి బాల వెంకటేశ్వర్లు, తండ్రి. పుల్లయ్య**, డి.నెం.టి 1 బ్లాక్, ఎ.ఆర్. క్వార్టర్స్, సుజాత నగర్ ఎదురుగా, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. **3) శ్రీమతి ఎమ్ సుజాత, భర్త. ఎమ్ బాల వెంకటేశ్వర్లు**, డి.నెం.టి 1 బ్లాక్, ఎ.ఆర్. క్వార్టర్స్, సుజాత నగర్ ఎదురుగా, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001 వార్లను డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన బకాయి **రూ.5,28,731/- (అక్షరాల ఐదు లక్షల ఇరవై ఎనిమిది వేల ఏడు వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే)** మరియు ఒప్పందం ప్రకారం తదుపరి వర్తించు వడ్డీ చెల్లించమని కోరుతూ **తేది. 30.05.2022** న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత విఫలమైనందున సదరు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్సు 2002 రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని **తేది. 14.03.2023** న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, సదరు ఆస్తితో ఎవరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తితో జరిపే ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం **రూ.5,28,731/- (అక్షరాల ఐదు లక్షల ఇరవై ఎనిమిది వేల ఏడు వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్ కె ఆర్ ఎమ్ జూనియర్ కాలేజీ బ్రాంచి, ఒంగోలు** వారి చార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి యొక్క వివరములు

ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా, ఒంగోలు, ఒంగోలు రూరల్, సోనియా గాంధీ నగర్, 1వ లైను, డోర్ నెం.7-226 సమీపాన, సర్వే నెం.226 లో 60.40 చ॥గ॥లు లేదా 544 చ॥అ॥లు లేదా 7.40 గదులు లేదా 50.53 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలము & గ్రౌండ్ & మొదటి అంతస్తు ఆర్‌సిసి భవనం యావత్తు ఆస్తి **శ్రీమతి ముండ్లమూరి సుజాత గారికి** చెందినది. **హద్దులు : ఉత్తరం :** రావూరి ఇంద్రమ్మ గారి స్థలం-16 అ॥లు, **తూర్పు :** వడ్డేపోలు వెంకటేశ్వర్లు గారి స్థలం-34 అ॥లు, **దక్షిణం :** 20' వెడల్పు రోడ్డు-16 అ॥లు, **పడమర :** పాకాల యలమంద గారి స్థలం-34 అ॥లు.

తేది : 14.03.2023 సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
ప్రదేశం : ఒంగోలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్ కె ఆర్ ఎమ్ జూనియర్ కాలేజీ బ్రాంచ్